కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పరిశీలన



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చందు యాదవ్

సింహాచలం: జీవీఎంసీ 94వ వార్డు పురుషోత్తపురంలో నిర్మిస్తున్న యాదవ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు కోరాడ చందుయాదవ్ పరిశీలించారు. ఇటీవల జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికుల కోరిక మేరకు యాదవ కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఆమోదం తెలిపారు. రెండు వారాల కిందట ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శంకుస్థాపన చేశారు. ఆ పనులను చందుయాదవ్ పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

సింహాచలం: పెందుర్తి మండలం అక్కిరెడ్డిపాలెంలో ఎనిమిది మంది పేకాట రాయుళ్లను సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కిరెడ్డిపాలెంలోని సరుగుడు తోటలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి వారిని పట్టుకున్నారు. రూ.84 వేల నగదు, 8 సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పెందుర్తి ఎస్ఐ ఆసిరి తాత కేసు నమోదు చేశారు.

పల్లెల వికాసమే ప్రభుత్వ లక్ష్యం



కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు



అంతకాపల్లి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్ రాజ్

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: ప్రతి గ్రామాన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రగతి పథంలో నడిపించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. మండలంలోని అంతకాపల్లి, వంగలి గ్రామ సచివాలయాల పరిధిలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకాపల్లిలో గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం,శ్రేయస్సు కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 1,182 గృహాలను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సేవలు అందించేందుకు జల్లెడ పట్టారన్నారు. వారి నుంచి 501 టోకెన్లు జనరేట్ కాగా రెండు మినహా మిగిలిన దరఖాస్తులు పరిష్కరించినట్లు చెప్పారు. తమ ప్రభుత్వంలో అంతకాపల్లి సచివాలయం పరిధిలోనే పలు సంక్షేమ కార్యక్రమాల ద్వారా లబ్ధిదారులకు రూ. 27.73 కోట్ల లబ్ధి చేకూర్చామన్నారు. అదేవిధంగా గ్రామంలో రోడ్లు, భవనాలు, పాఠశాల ఆధునికీకరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలను రూ.8.76 కోట్లతో చేపట్టామన్నారు. వెరసి 36.49 కోట్లు నిధులు వెచ్చించి గ్రామ సమగ్రాభివృద్ధికి కృషి చేశామని తెలిపారు. గత ప్రభుత్వంలో పథకాల కోసం ప్రజలు నాయకులు,అధికారులు చుట్టూ తిరిగేవారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పథకాలు అందించడానికి ప్రజల చుట్టూ నాయకులు, అధికారులు తిరిగేలా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్న వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గజదొంగలతో పోలుస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని విమర్శించే అవకాశం లేక వలంటీర్లపై వారు చేస్తున్న దిగజారుడు వ్యాఖ్యలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి తమ మద్దతు తెలియజేయాలని అదీప్‌రాజ్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి,జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ తుంపాల అప్పారావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజయ్ రాజ్, జగనన్న సురక్ష నియోజకవర్గ ఇన్‌చార్జి కొటాన రాము, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవిందు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాల నాయుడు, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసీల్దార్ బి. సత్యనారాయణ, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, గవర రాజు, కోట్ని అమ్మతల్లి నాయుడు, యర్రా శ్రీనివాసరావు, వేపాడ సోమనాయుడు, సబ్బవరపు దేవుడు, బుదిరెడ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శివరామకృష్ణశర్మకు జ్యోతిష్య రత్న పురస్కారం



టీటీడీ అర్చకులు వేణుగోపాల దీక్షితులు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శివరామకృష్ణ శర్మ

సింహాచలం: పెందుర్తి మండలం సరిపల్లికి చెందిన ముక్కు శివరామకృష్ణ శర్మకు జ్యోతిష్య రత్న పురస్కారం లభించింది. జ్యోతిష్యం, వాస్తు, పురోహితం, అర్చక రంగాల్లో శివరామకృష్ణ శర్మ చేస్తున్న విశేష కృషిని గుర్తించి హైదరాబాద్‌కు చెందిన విశ్వజ్యోతి విజ్ఞాన సంస్థ ఈ పురస్కారం ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన వైదిక జ్యోతిష్య సమ్మేళనంలో తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు వేణుగోపాల దీక్షితులు చేతుల మీదగా శివరామకృష్ణ పురస్కారం అందుకున్నారు.

కుండపోత వర్షం

- జలమయమైన రోడ్లు
- కూలిన వరాహ పుష్కరిణి రక్షణ గోడ



పెందుర్తిలో కురుస్తున్న వర్షం



విజినిగిరిపాలెం రహదారిలో కూలిన వరాహ పుష్కరిణి రక్షణ గోడ

సింహాచలం: సింహాచలం, పెందుర్తిలో సోమవారం కుండపోత వర్షం కురిసింది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి దాదాపు గంటన్నరపాటు ఏకధాటిగా వర్షం దంచి కొట్టింది. పలు చోట్ల రోడ్లు జలమయమయ్యాయి. అడవివరం ప్రధాన రహదారిలో పైడితల్లి ఆలయం వద్ద రోడ్డుపై వర్షపు నీరు ప్రవాహంలా పారింది. భారీ వర్షానికి విజినిగిరిపాలెం వెళ్లే రహదారిలో వరాహ పుష్కరిణి రక్షణ గోడ కూలిపోయింది. గోడ శిథిలాలు రోడ్డుపైకి వచ్చాయి. ఆసమయంలో ఎవరూ రాకపోకలు సాగించకపోవడంతో ప్రమాదం తప్పింది. పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి నుంచి విశాఖ వచ్చే రహదారిపై వర్షపునీరు పెద్ద ఎత్తున నిలిచిపోయింది. చెరువును తలపించింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

మహోన్నతుడు అయ్యంకి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సన్యాసశెట్టి

సింహాచలం: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 133వ జయంతిని అడవివరం శాఖ గ్రంథాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ భవన స్థల దాత దాసరి సన్యాసశెట్టి అయ్యంకి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో అయ్యంకి గ్రంథాలయ ఉద్యమాన్ని నడిపించిన మహోన్నతుడు అని కొనియాడారు. కార్మిక నాయకుడు సీహెచ్ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ గ్రంథాలయలు విజ్ఞాన నిలయాలన్నారు. గురుకుల పాఠశాల గ్రంథాలయాధికారి రఘు అయ్యంకి జీవిత విశేషాలను తెలియజేశారు. ఈ సందర్భంగా అయ్యంకి జీవిత విశేషాలపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం, ఉద్యోగి ఎల్లమ్మ, గురుకుల పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయుడు పీవీ రమణ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం .. కమనీయం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

తుపాను రక్షిత భవనాలు శిథిలం!



దలాయిపాలెంలో శిథిలభవనం కింద కట్టిన గేదె



స్వయంభూవరంలో ప్రమాదకరంగా తుపాను భవనం

భయాందోళనలో ప్రజలు

పరవాడ: విపత్తుల సమయంలో లోతట్టు గ్రామాల ప్రజల సౌకర్యార్థం మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన తుపాను రక్షిత భవనాలు శిథిలమయ్యాయి. మరో రెండు భవనాలు నేడో రేపో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. అందుకు స్వయంభూవరం, దలాయిపాలెం గ్రామాల్లోని తుపాను భవనాలను ఉదాహరణగా పేర్కొనవచ్చు.

ఇదీ పరిస్థితి : మండలంలోని మత్స్యకార గ్రామాలైన ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం, లోతట్టు గ్రామాలైన స్వయంభూవరం, దలాయిపాలెం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, వెంకటపతి పాలెం గ్రామాల్లో సుమారు 40 ఏళ్ల కిందట ప్రభుత్వం తుపాను రక్షిత భవనాలు నిర్మించింది. వీటినే కొన్నేళ్లపాటు పాఠశాలలు, వసతిగృహాలు, మిల్క్ సెంటర్లు, మత్స్యకారులు పనిముట్లు భద్రపర్చుకోవడానికి వినియోగించారు. అయితే రక్షిత భవనాలు మరమ్మతులకు నోచుకోవడంతో అధికారులు వాటి ఆలనాపాలన చూడడం మానేశారు. ఫలితంగా ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం గ్రామాల్లోని భవనాలు శిథిలావస్థకు చేరి కూలిపోయాయి. స్వయంభూవరం, దలాయిపాలెం, వాడచీపురుపల్లి, వెంకటపతిపాలెం గ్రామాల్లోని తుపాను షెల్టర్లు శిథిలావస్థకు చేరి పెచ్చులూడిపడుతున్నాయి. నివాస ప్రాంతాలకు సమీపంలో శిథిల భవనాలు ఉండడంతో అవి ఏ క్షణాన కూలుతాయోనని ప్రజలు బితుకు బితుకుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. నాయుడుపాలెంలో తుపాను భవనాన్ని తాత్కాలిక ఆర్‌బీకే కేంద్రంగా ఉపయోగిస్తున్నారు. ఈ భవనం కూడా శిథిలమైంది. దెబ్బతిన్న భవనాలను తొలగించి నూతన భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

నమో శివరుద్రాయ



ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామికి బిల్వపత్రాలతో పూజలు చేశారు. మహిళలు ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు పలురకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

దేవస్థానం అధికారులపై ఫిర్యాదు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అధికారులపై అడవివరం ప్రాంతానికి చెందిన రైతు కేశిబోయిన అప్పలరాజు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. అడవివరంలోని రెండో టోల్‌గేట్ వద్ద ఉన్న 2.30 ఎకరాల భూమికి సంబంధించి దేవస్థానం అధికారులు తన చేత బలవంతంగా సంజాయిషీ లేఖ రాయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గోపాలపట్నం సీఐ నరసింహారావు దర్యాప్తు చేస్తున్నారు. కాగా సదరు భూమికి సంబంధించి అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని సింహాచలం దేవస్థానం భూ పరిరక్షణ విభాగం ఏఈవో పేర్కొన్నారు.

27 వరకు కోర్సుల ఎంపికకు గడువు పెంపు

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో డిగ్రీలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు తమ కళాశాల, కోర్సులు ఎంపిక చేసుకునేందుకు ఈనెల 27వ వరకు గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని నూతన విద్యా విధానంలో ప్రయోజనాలు పొందాలని ఆమె సూచించారు.

ప్రైవేటీకరణతో కార్మికులకు నష్టం

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కార్మిక సంక్షేమానికి చేటు అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాలతో ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 893వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెడితే, మౌలిక సదుపాయాల కల్పనలన్నీ ఆ కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోయి ప్రజలపై పన్నుల భారాలు మరింత పెరుగుతాయన్నారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వ రంగ సంస్థలను అభివృద్ధి చేసి, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వారు లాభాలను దండుకుని ప్రజలను అణచివేస్తారని విమర్శించారు. అందుకే విశాఖ ఉక్కుతో సహా అన్ని ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. లేదంటే రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

నేడు బోదువలసలో గడప గడపకు..

సబ్బవరం: మండలంలోని బోదువలస సచివాలయం పరిధిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల జేసీఎస్ కన్వీనర్ ముత్యాల నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్రాజు గడపగడపకు వెళ్లి ప్రజాసమస్యలు తెలుసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు.